క్లుప్తంగా

మంత్రి పొంగులేటిని కలిసిన జానకీరామయ్య



పొంగులేటిని సన్మానిస్తున్న జానకీరామయ్య

నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెనికె జానకీరామయ్య కలిసి అభినందించారు. హైదరాబాద్‌లోని తన చాంబర్‌లో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. మండలంలోని తాజా రాజకీయ పరిస్థితులను వివరించి ప్రజాపాలనపై వస్తున్న స్పందనను వివరించినట్లు జానకీరామయ్య తెలిపారు. ఆయన వెంట ఆయన కుమారుడు వెనికె కిశోర్ తదితరులు ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేసిన మంత్రి తుమ్మల



ఎల్‌ఓసీ అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని ఖిల్లాబజార్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ మాలిక్ కుమారుడు మహ్మద్ ఖుద్దూస్ అనే బాలుడు అనారోగ్యంతో బాధపడుతుండగా.. వైద్య చికిత్సకు డబ్బులు వెచ్చించే స్తోమత లేకపోవడంతో అతడి తల్లిదండ్రులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆశ్రయించారు. తక్షణమే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి రూ.1.50లను ఎల్‌ఓసీ ద్వారా మంజూరు చేయించి సంబంధిత చెక్కును ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో లబ్ధిదారుడికి అందించారు. ఈసందర్భంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు మంత్రి అభినందన

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన పెన్షనర్స్ డేలో నంది అవార్డు గ్రహీత కృష్ణమూర్తికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లోని బిర్లామందిర్‌లో రుద్రస్టూడియో వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయం పోటీలలో కృష్ణమూర్తికి నంది అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య, నెహ్రూనగర్ బీ–గ్రూప్ అధ్యక్ష, కార్యదర్శులు మారం రాజు, రాధాకృష్ణారావు, హనుమంతరావు, రమేశ్, టి.జనార్దన్‌రావు, డీకే శర్మ, వెంకటేశ్వర్లు, సర్వర్ మియా, రామ్‌చరణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెం శివారులోని శ్రీరామలింగేశ్వర స్వామి శివాలయంలో ఆదివారం రామోజీ గురుస్వామి, కీమా గురుస్వామి ఆధ్వర్యాన శివభక్తులు ఇరుముడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భజనల అనంతరం ఇరుముడితో మాలధారులు శ్రీశైలం బయలుదేరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	హాయ్ నాన్న
సాయిరాం	డెవిల్
ఆదిత్య	సలార్
శ్రీనివాస	సలార్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	3
వంకాయ	60		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	44		20
కాకర	76	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	46	తోటకూర	3
దొండ	50		10
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	120		10
గోరుచిక్కుడు	66	మెంతికూర	2
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	36	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		30
చామగడ్డ	50	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	76	-ఖమ్మం వ్యవసాయం	



ఆఫర్లతో కేక్‌ల విక్రయాలు



ప్రత్యేకంగా తయారు చేసిన కేక్



గాజులు, ముగ్గుల రంగులు విక్రయాలు

నయా జోష్..

నూతన సంవత్సర వేడుకలకు ఘనస్వాగతం

- ఆఫర్లతో వ్యాపార సంస్థల్లో సందడి
- కేక్‌లు, స్వీట్స్, కూల్ డ్రింక్‌లు, ముగ్గులకు రంగుల విక్రయాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహిస్తున్న యువతీయువకులు

ఖమ్మంగాంధీచౌక్: ఎక్కడ చూసినా హ్యాపీ న్యూ ఇయర్ పలకరింపే.. పిల్లలు మొదలు పెద్దల వరకు అంతా 2023కు గుడ్‌బై చెబుతూ.. 2024 సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఆదివారం వేడుకల్లో మునిగి తేలారు. అంతటా న్యూ ఇయర్ జోష్ కనబడింది. మంచి చెడులు, లాభనష్టాలు, జయాపజయాల నడుమ 2023 సాగగా.. కొన్ని వర్గాల ప్రజలకు ఆశాజనకంగా, మరికొన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు, నష్టాలను మిగిల్చింది. అంతేకాక రాష్ట్రంలో శాసన సభ ఎన్నికలు జరిగి ప్రభుత్వ మార్పిడి జరిగింది. కాగా, నూతన సంవత్సరం ఆనందంగా సాగాలని కోరుకుంటూ క్రిస్టియన్లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోలీస్ విభాగం విధించిన ఆంక్షల నడుమ యువత ఈ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు యువతీ, యువకులు, పిల్లలు, పెద్దలు రోడ్లపైకి చేరి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేరింతలు కొట్టారు. కొందరు యువత బైక్‌లపై తిరుగుతూ సరదాలు పంచుకుంటూ హంగామా చేశారు. వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లో ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

2024పై ప్రజలు ఎన్నో ఆశలు, ఆశయాలతో ఉన్నారు. నూతన సంవత్సరంలో చేపట్టబోయే పనులు విజయవంతం కావాలని, ఎటువంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సాగాలని ఇష్టమైన దైవాలను వేడుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. ఇందులో ప్రధానంగా నిరుద్యోగులు, అన్నదాతలు, వ్యాపారులు, పరిశ్రమల వర్గాలు తదితర వర్గాల వారు నూతన సంవత్సరంలో బాగుండాలని కోరుకున్నారు.

ఆఫర్లతో వ్యాపార సంస్థల సందడి..

నూతన సంవత్సరం సందర్భంగా వ్యాపార సంస్థలు ఆఫర్లు ప్రకటించడంతో ప్రజలు కొనుగోళ్లపై ఆసక్తి కనబరిచారు. దీంతో రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లు, బేకరీ, స్వీట్ షాపులు, వాహన షోరూంలు, బట్టల షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ప్రధానంగా నగరంలోని కస్బాబజార్, కమాన్‌బజార్, వైరారోడ్, ఇల్లెందు క్రాస్ రోడ్, బైపాస్ రోడ్, మయూరిసెంటర్, గాంధీచౌక్ తదితర వ్యాపార కూడళ్లు, బజార్లు రద్దీగా మారాయి.

కేకులు, స్వీట్ల దుకాణాల వద్ద రద్దీ..

న్యూ ఇయర్ సందర్భంగా కేకులు, స్వీట్లు, కూల్ డ్రింక్స్‌లతో పాటు ముగ్గుల కోసం రంగుల విక్రయాలు జోరుగా సాగాయి. ఆఫర్లతో పెద్ద ఎత్తున కేకులు, స్వీట్లు, కూల్‌డ్రింక్స్ విక్రయించారు. కేజీ కేక్ రూ.250లు కాగా, దీనికి లీటరు కూల్ డ్రింక్, అరకిలో కేక్‌ను రూ.150లు కాగా 750 మి.లీ కూల్‌డ్రింక్ ఉచితంగా ఇచ్చారు. ఇక కొన్ని రెస్టారెంట్లు, బిర్యానీ పాయింట్లలో రెండు బిర్యానీలకు ఒక బిర్యానీ ఉచితంగా విక్రయించారు. ఇక కొన్ని బిర్యానీ పాయింట్లలో రూ. 129లకు బకెట్ బిర్యానీని విక్రయించారు.

ఫంక్షన్ హాల్‌లలో నాన్ ఆల్కహాలిక్ పార్టీలు..

వివిధ రకాల సంస్థలు వైరారోడ్, మామిళ్లగూడెం, బైపాస్‌రోడ్‌లలోని పలు ఫంక్షన్ హాల్‌లలో నాన్ ఆల్కహాలిక్ పార్టీలను నిర్వహించాయి. పలు వైద్య సంస్థలు, జ్యూయలరీ, డెకరేటివ్ సంస్థలు, ఇతర వ్యాపార సంస్థలు ఈ కార్యక్రమాలకు కో స్పాన్సర్లుగా ఉన్నారు. నాన్‌స్టాప్‌లైవ్ మ్యూజిక్, లక్కీ డ్రా, ప్రత్యేక కమేడియన్లతో కామిడీ స్కిట్లు, స్టాండప్ కామిడీ, అథెంటిక్ ఫుడ్, ఫొటోగ్రఫీ బూత్, ఎగ్జిస్టింగ్ గిఫ్టులు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఇక ఈ ఈవెంట్స్ నిర్వహించే చోట రూ. 449లకు ఎంట్రీ పాస్ కల్పించి డిన్నర్‌తో మొత్తంగా రూ. 699లకు సౌకర్యం కల్పించారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తాం..



2023 ఏడాది నాకు మంచి అనుభూతిని మిగిల్చింది. ఖమ్మం సుందరీకరణలో భాగమై పలు అభివృద్ధి పనులు పూర్తి చేయించాం. ఇదే విధంగా 2024 ఏడాదిలోనూ ప్రజలతో మమేకమై అభివృద్ధితో పాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తా. ఈ ఏడాది ప్రజలందరికి మంచి జరగాలని, వారు అనుకున్నవి సాధించాలని కోరుతున్నా. ఖమ్మం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– ఆదర్శ్ సురభి, కేఎంసీ కమిషనర్

తలసేమియా నిర్మూలనే లక్ష్యం..



2023 ఏడాదిలో తలసేమియా చిన్నారులకు మా సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా బోన్‌మ్యారో చికిత్స చేయించి వారికి సాధారణ జీవనం కల్పించామన్న సంతృప్తి కలిగింది. ఒకరిద్దరు చిన్నారులను కోల్పోయినా.. 2024 ఏడాదిలో తలసేమియా వ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం పని చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. కొత్తగా తలసేమియాతో చిన్నారులు పుట్టకుండా ప్రజల్లో పూర్తి అవగాహన కల్పిస్తాం.

– ప్రొద్దుటూరి రవిచంద్ర, హోంగార్డు

కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృత పరచాలి



శ్రీనివాసరెడ్డితో చర్చిస్తున్న గల్లా సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువకావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఏర్పాట్లపై ఖమ్మం జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ అట్లూరి శ్రీనివాసరెడ్డిని కార్యాలయంలో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడుతూ.. అన్ని గ్రామపంచాయతీల్లో ఉజ్వల యోజన, ఉచిత గ్యాస్ పథకం, ప్రధానమంత్రి సురక్షయోజనపై దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా అట్లూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 8 ప్రచార రథాలతో గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్నారని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, అధికార ప్రతినిధి విజయరెడ్డి, ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, విష్ణుకాంత్, నాయకులు ఉపేందర్‌రెడ్డి, డీకొండ శ్యామ్, శ్రీకాంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాల ఎంపికతోనే అధిక దిగుబడి



క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్న రైతులు

కామేపల్లి: నాణ్యమైన విత్తనాల ఎంపికతోనే అధిక దిగుబడి సాధించవచ్చని మంజీర సీడ్స్ కంపెనీ డైరెక్టర్ నల్లేరు గురువిరెడ్డి అన్నారు. బర్లగూడెం గ్రామానికి చెందిన జర్పుల హరి అనే రైతు మంజీర సీడ్స్ ఎక్సెల్, మంజీర హాట్ మిరప విత్తనాలతో సాగు చేసిన మిరపతోటలో రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీర సీడ్స్ విత్తనాలు సాగు చేసిన రైతుల మిరప తోటలో తెగుళ్ల బెడద తక్కువని, పెట్టుబడి కూడా తక్కువగా ఉంటుందన్నారు. కోత సులభంగా ఉండడమే కాక ఎకరాకు సుమారుగా 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ మార్కెటింగ్ జోనల్ మేనేజర్ ఏలూరు విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

గురుకులాలను కామన్ డైరెక్టరేట్‌లోకి తీసుకురావాలి



నూతన కమిటీతో యూటీఎఫ్ నేతలు

ఖమ్మం సహకారనగర్: అన్ని గురుకులాలను కామన్ డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకురావాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవానీ, టీఎస్ యూటీఎఫ్ మైనారిటీ గురుకుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మహేశ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ భవన్‌లో మైనారిటీ గురుకుల ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉపాధ్యాయులు సమావేశమై టీఎస్ యూటీఎఫ్ అనుబంధంగా మైనారిటీ గురుకుల విభాగం ఖమ్మం జిల్లా కార్యవర్గ కమిటీనిఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా వి. దామోదర్, కోశాధికారిగా వై.శేషగిరి, ఉపాధ్యక్షులుగా ఇ.జీవన్, డి.సావిత్రి, కార్యదర్శులుగా ఎల్.జితేష్, జి.క్రాంతికుమార్, ఎండీ.రఫీ, బి.గాంధీ, జి.అనిత, కరుణజ్యోతి, జ్యోతి, ఎం.ఉష, తాహిరాబేగం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చావా దుర్గాభవాని, మహేష్ మాట్లాడుతూ.. గురుకుల ఉపాధ్యాయులకు పారిటీ స్కేల్స్ ఇవ్వాలని, హాస్టళ్లకు కేర్ టేకర్లను నియమించాలని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడుగమల్లేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరావు, షేక్.రంజాన్, బుర్రి వెంకన్న, షమీ, సోషల్ వెల్ఫేర్ ఖమ్మం జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు, పి.మహేశ్, నవీన్ కుమార్ మైనారిటీ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్‌కాలనీలోని శ్రీ అభయ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవస్థానం చైర్మన్‌గా బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శిగా పురం తిరుపతయ్య, కోశాధికారిగా బానోత్ మల్సూర్‌నాయక్, పాలక మండలి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరు సోమవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయనుండగా.. కార్పొరేటర్ దండాజ్యోతిరెడ్డి, పల్లెబోయిన చంద్రయ్య, అల్లిక ఆంజయ్య, తదితరులు వారిని అభినందించారు.

వాగ్దానాలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకన్న అధ్యక్షతన జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలని జనవరి 21న వనపర్తిలో జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మొదటి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఐఎఫ్‌టీ యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.ఆశోక్, వెలదండి బాబు, ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసరావు, సీవై పుల్లయ్య, ఎస్‌కె.లాల్‌మియా, పి.రాందాస్, ఎ.శరత్, పుల్లారావు, కె.శ్రీనివాస్, జి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ హంగామా..!



సెయింట్ జోసెఫ్ చర్చిలో ప్రార్థన చేస్తున్న ఫాదర్



ముగ్గుల విక్రయాలు ఇలా..



శ్రీనివాసనగర్‌లో ముగ్గు వేస్తున్న మహిళ



మిఠాయిలు కొంటున్న ప్రజలు



ఓ హాస్టల్‌లో సందడి చేస్తూ కేక్ కట్ చేస్తున్న బాలికలు



బిర్యానీ అమ్ముతున్న దృశ్యం



సందడిగా మారిన లిక్కర్ మార్ట్

ప్రధాన అర్చకుడికి సన్మానం..

నేలకొండపల్లి: మండలకేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలోని ప్రధాన అర్చకుడు తుప్రాణి మధుసూధన్‌చార్యులు ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈమేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యాన ఆయనను అధికారులు, సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మధుసూదన్‌చార్యులు మాట్లాడుతూ.. తాను 30 ఏళ్లపాటు స్వామి వారికి సేవ చేసే భాగ్యం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ పి.నారాయణచార్యులు, సిబ్బంది లక్ష్మీకల్యాణి, పి.శ్రీనివాసరావు, సీహెచ్.కృష్ణమూర్తి, టి.సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు..

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ తుమ్మా ధనమూర్తి ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ పాల్గొని సన్మానించి మాట్లాడారు. ఆర్టీసీలో ధనమూర్తి అంకిత భావంతో 28 ఏళ్లపాటు పని చేసి ఉత్తమ డ్రైవర్‌గా గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈవూరి సుజాత, ఎంపీటీసీ కనమర్లపూడి పుష్పలత, సొసైటీ చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్, సొసైటీ మాజీ చైర్మన్ ఈవూరి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కనమర్లపూడి రాము, నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, ఎడవల్లి హుస్సేన్ గౌడ్, హరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రైతునేస్తం సదస్సులో 'నల్లమల'కు సత్కారం

ఖమ్మంవ్యవసాయం: తెలుగు రాష్ట్రాల స్థాయిలో గుంటూరు జిల్లా కొర్నెపాడు గ్రామంలో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం జరిగిన ప్రకృతి వ్యవసాయం– ఔషధ మొక్కల పెపకంపై జరిగిన అవగాహన సదస్సులో జిల్లాకు చెందిన మాజీ రైతు సమన్వయ సమితీ కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆహారం–ఆరోగ్య నిపుణులు ఖాదర్‌వలీ, రైతునేస్తం పత్రిక సంపాదకులు వై.వెంకటేశ్వరరావు చత్తీస్‌ఘడ్ ఉద్యాన అధికారి చంద్రశేఖర్‌లు పాల్గొని మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ విధానాలతో సాగు చేసిన పంటలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందనే అంశాలను వివరించారు. ఆరోగ్యానికి హాని చేయని పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని ప్రతినిధులు ఈ సదస్సులో సూచనలు చేశారు.

ఆర్టీసీ సమస్యలు పట్టించుకోని గత ప్రభుత్వం

ఖమ్మం మామిళ్లగూడెం: గత ప్రభుత్వ యాజమాన్యం కార్మికుల పట్ల సంస్థ చిత్తశుద్ధి లేకపోవడంతో గత పదేళ్లుగా.. ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించలేదని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం రీజియన్ కార్యదర్శి పాటి అప్పారావు ఆరోపించారు. ఆదివారం ఖమ్మం రీజియన్ అధ్యక్షుడు పిల్లి రమేశ్ అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం సమస్యలపై యాజమాన్యానికి దిశా నిర్దేశం చేయాలని, 2017 నుంచి2021 వేతన సవరణను తక్షణమే చేసి ఏరియర్స్ కూడా చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు తిమ్మినేని రామారావు, అరుణకుమారి, వెంకన్న, రామచంద్రరావు, నాగభూషణరావు, బుచ్చిబాబు, లాజర్, పి.వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా, పవన్‌కుమార్, జైకిరణ్‌కుమార్, భద్రం, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడుకు చెందిన మాజీ సైనికుడు దున్న వెంకటయ్య(71) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. భారత్–చైనా యుద్ధ సమయంలో పాల్గొన్న వెంకటయ్యను భారత ప్రభుత్వం సంగ్రామ్ మెడల్‌తో సత్కరించింది. వెంకయ్యకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఇదిలా ఉండగా కుటుంబ సభ్యులు వెంకటయ్య మృతదేహాన్ని మమత ఆస్పత్రి వైద్య విద్యార్థులకు వివిధ పరిశోధనల నిమిత్తం అందించగా.. పలువురు అభినందించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు

ఖమ్మంగాంధీచౌక్: దేవాలయాల భక్త బృందాల ద్వారా ప్రతీ ఇంటికి అక్షింతలు అందించాలని శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర, అయోధ్య భక్త బృందం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే వివిధ దేవాలయాల భక్త బృందాలు ఖమ్మం నగరంలోని ఎస్‌ఎస్‌పీ రామాలయం నుంచి అయోధ్య అక్షింతలను స్వీకరించి పంపిణీ చేసే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జనవరి 1(సోమవారం) నుంచి నగరంలోని ప్రతి ఇంటికి భక్త బృందాలు అక్షింతల కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అక్షింతల కోసం 90141 10604, 93464 03188 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సీసీ రోడ్డు ఆక్రమించి ర్యాంప్ నిర్మాణం





సీసీ రోడ్డును కమ్మేసి నిర్మాణం చేపట్టిన ఇంటి ర్యాంప్

కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని 6వ డివిజన్‌లో సీసీ రోడ్డును ఆక్రమించి ఒక ఇంటి నిర్మాణదారుడు రోడ్డుపైనే ర్యాంప్ నిర్మాణం చేసి దారిలేకుండా మూసి వేశారని దీనిపై తగు చర్యలు తీసుకొని తమకు దారి ఇబ్బందిలేకుండా చూడాలని స్థానికులు కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానికులు మాట్లాడుతూ.. ఇల్లెందు ప్రధాన రోడ్డు నుంచి ఖానాపురం వెళ్లే రోడ్డులో వైఎస్సార్ నగర్ రోడ్డు నంబర్ -1లో ఇటీవల కొత్తగా నిర్మాణం చేసిన ఓ ఇంటికి ర్యాంప్‌పేరుతోకంగా సీసీ రోడ్డునే ఆక్రమించి నిర్మాణం చేశాడు. ఆ రోడ్డుపైకి వచ్చేలా ర్యాంప్ నిర్మాణం చేయడంతో తమకు రాకపోకలు సాగించడానికి దారిలేకుండా పోయిందని స్థానికులు వాపోయారు. ర్యాంపు నిర్మాణంతో నాలుగు రోడ్ల కూడలి కూడా ఉండటంతో ద్విచక్ర వాహనం కూడా పోవడానికి కష్టంగా ఉందని తమ రహదారి సమస్యపై తగు చర్యలు తీసుకొని దారి మార్గం చూపాలని కోరారు.